క్లుప్తంగా

క్రీడలతో దేహదారుఢ్యానికి దోహదం

నెహ్రూ యువ మండల కో–ఆర్డినేటర్ మహేశ్

షాబాద్: క్రీడలు దేహదారుఢ్యానికి ఎంతో దోహదపడుతాయని నెహ్రూ యువ కేంద్రం మండల కో–ఆర్డినేటర్ దాదె మహేశ్ పేర్కొన్నారు. మంగళవారం కక్కులూర్ గ్రామంలో గత రెండు రోజులుగా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీ బాల్ క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాలీబాల్‌లో 16 జట్లు, కబడ్డీలో 8 జట్లు పాల్గొన్నాయి. వీరిలో వాలీబాల్ మొదటి బహుమతి కక్కులూర్, రెండవ బహుమతి అంతరం జట్టు విజయం సాధించాయి. కబడ్డీ మొదటి బహుమతి కుర్వగూడ, రెండవ బహుమతి కక్కులూర్ జట్టు విజయం సాధించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మమత, ఎంపీటీసీ కరుణాకర్, ఉప సర్పంచ్ నర్సింహులుగౌడ్, మాజీ ఎంపీటీసీ జీవన్‌రెడ్డి, పీఈటీలు రవీందర్‌గౌడ్, ఆంజనేయులు, తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



లింగారెడ్డి సోదరులను పరామర్శిస్తున్న సబితారెడ్డి

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎ.లింగారెడ్డి తల్లి లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో మంగళవారం మంత్రి సబితారెడ్డి మండలంలోని ఎల్వేర్తి గ్రామానికి వెళ్లి లింగారెడ్డి అతని సోదరులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం మృతురాలికి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె వెంట స్థానిక మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

రైతులకు ఈకేవైసీ తప్పనిసరి


మండల వ్యవసాయాధికారి రాగమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న రాగమ్మ

మొయినాబాద్: పీఎం కిసాన్ పథకం కోసం రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రాగమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీఎం కిసాన్ పథకం డబ్బులు రావాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ చేయించాలన్నారు. మండలంలోని చాలా మంది రైతులు ఇంకా చేయించుకోలేదని చెప్పారు. ఈ నెల 15 లోపు మీసేవ కేంద్రాల్లో, ఆన్‌లైన్ సెంటర్లలో ఆధార్ నెంబర్, ఫోన్‌నెంబర్ తీసుకెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఇదే చివరి అవకాశంగా గుర్తించి వెంటనే ఈకేవైసీ చేయించు కోవాలన్నారు. సమావేశంలో ఏఈఓ సునిల్, రైతులు నర్సింహ్మాచారి, సైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు సంయమనం పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రవీందర్ యాదవ్

కొందుర్గు: క్రీడాకారులు సంయమనం పాటించాలని కేశంపేట ఎంపీపీ రవీందర్ యాదవ్ సూచించారు. మంగళవారం కొందుర్గులో నిర్వహించిన కేపీఎల్–3 క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందుర్గు క్రీడలకు పుట్టినిల్లు అన్నారు. ఈ ప్రాంతంలో యువకులు క్రీడలపై ఆసక్తి చూపడం ఎంతో సంతోషకరమన్నారు. క్రీడల్లో గెలుపోటములు సర్వసాధారణంగా భావించి, క్రీడాకారులు స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో కొందుర్గు వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, నాయకులు రామకృష్ణ, జగదీశ్వర్‌గౌడ్, రాములు గౌడ్, యాదగిరి, శ్రీను, మశ్చందర్‌గౌడ్ పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారాల్లో రాణించాలి

డీఆర్‌డీఏ డీపీఎం శేఖర్

కేశంపేట: మహిళలువ్యాపారాల్లో రాణించాలని డీఆర్‌డీఏ డీపీఎం శేఖర్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం మండల మహిళ సమాఖ్య ఈసీ సమావేశం ఏపీఎం భగవంతు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ.. మండలంలో ఏర్పాటు చేసుకున్న భూతల్లి మహిళ ఉత్పత్తి కంపెనీ లిమిటెడ్ ద్వారా మొక్కజొన్నలను కొనుగోలు చేసి ఎఫ్‌పీసీకి విక్రయించడం ద్వారా రైతులకు మేలు జరిగిందన్నారు. రానున్న రోజుల్లో రైతుల నుంచి కూరగాయలను కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సుగుణమ్మ, చిట్టి, విజయ, చంద్రకళ, యాదగిరి, మహేష్, రాంచంద్రయ్య, మల్లేష్, జంగయ్య, యాదయ్య, తిరుపతమ్మ పాల్గొన్నారు.

కలగానే సర్వీస్ రోడ్ల అభివృద్ధి

- గుంతలమయంగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు



పెంజర్ల కూడలి సమీపంలో అభివృద్ధికి నోచుకోని సర్వీస్‌రోడ్డు



కొత్తూరు శ్మశానవాటిక వద్ద సర్వీస్‌రోడ్డుపై పారుతున్న చెరువు నీరు

కొత్తూరు: అధికారుల అలసత్వం.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా అమాయక ప్రజలు రోడ్డు ప్రమాదాల్లో బలవుతున్నారు. విషయం తెలిసినప్పటికీ అటు అధికారులు.. ఇటు కాంట్రాక్టర్లు ప్రమాదాల నివారణకు కనీస చర్యలు తీసుకోవడం లేదు. గత తొమ్మిదేళ్ల క్రితం మండల కేంద్రం నుంచి షాద్‌నగర్ సమీపంలోని సోలీపూర్ గేటు వరకు సుమారు 18 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు ఏర్పాటైంది. కాగా, రోడ్డుకు ఇరువైపులా ఉన్న (అనుబంధ) సర్వీస్‌రోడ్లను అభివృద్ధి చేయడం మరిచారు. ఘట్‌కేసర్–యాదగిరిగుట్ట, అవుటర్ రింగ్ రోడ్డు చుట్టు అధికారులు ప్రధానరోడ్లతో పాటే సర్వీస్ రోడ్లను పూర్తి చేశారు. దీంతో సమీప గ్రామాల ప్రజలు ప్రధానరోడ్లపైకి వెళ్లకుండా సర్వీస్‌రోడ్ల నుంచే రాకపోకలు కొనసాగిస్తూ సురక్షితంగా తమ గ్రామాలకు చేరుకుంటున్నారు. అయితే, కొత్తూరు మండలంలో మాత్రం పరిస్థితి పూర్తి విరుద్ధంగా ఉంది. కొత్తూరు నుంచి సోలీపూర్ గేటు వరకు ఉన్న బైపాస్ రోడ్డుకు ఇరువైపులా సర్వీస్‌రోడ్లను అభివృద్ధి చేయలేదు. దీంతో సమీప గ్రామాల ప్రజలు బైపాస్ రోడ్డుపై నుంచి ప్రయాణిస్తూ తరచుగా ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారు.

స్థలం సేకరించినా అభివృద్ధి లేదు..

2009లో కొత్తూరు నుంచి షాద్‌నగర్ సమీపంలోని సోలీపూర్ గేటు వరకు సుమారు 18 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డును ఏర్పాటు చేశారు. అప్పుడే రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ రోడ్లకోసం స్థలాన్ని సైతం సేకరించారు. తర్వాత ప్రధాన రోడ్డును పూర్తి చేసిన కాంట్రాక్టర్లు కొన్ని సంవత్సరాల తర్వాత సర్వీస్ రోడ్లపై మట్టిపోసి చదును చేసి చేతులు దులుపుకున్నారు. అంతేతప్ప ఏమాత్రం అభివృద్ధి చేయలేదు. అధికారులు సైతం ఈ దిశగా చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సమావేశం నిర్వహించినా ఫలితం శూన్యం..

బైపాస్ రోడ్డుపై జరుగుతున్న ప్రమాదాలపై స్థానికులు మృత్యువాత పడుతున్నట్లు తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ గత మూడేళ్ల క్రితం పలువురు అధికారులు, రోడ్డు నిర్వహణ కాంట్రాక్టర్లతో కొత్తూరులో సమావేశం నిర్వహించారు. కొత్తూరు నుంచి షాద్‌నగర్ సమీపంలోని సోలీపూర్ గేటు వరకు సర్వీస్ రోడ్లను అభివృద్ధి చేయాలని కోరగా.. అందుకు వారు తమ ప్రొసీడింగ్స్‌లో సర్వీస్ రోడ్లను అభివృద్ధి చేసే విధంగా ఒప్పందం లేనట్లు ఎమ్మెల్యేకు విన్నవించారు. కానీ, 18 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న సర్వీస్ రోడ్లపై మాత్రం మట్టిపోసి ఇరువైపులా వాహనాలు వెళ్లే విధంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. మూడేళ్ల క్రితం ఇచ్చిన హామీ ఇప్పటివరకు వాస్తవరూపం దాల్చలేదు. కనీసం అధికారులు సైతం కాంట్రాక్టర్లతో చర్చించి అనుబంధ రోడ్లను అభివృద్ధి చేసే విధంగా కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

సర్వీస్ రోడ్లను అభివృద్ధి చేయాలి



కొత్తూరు నుంచి షాద్‌నగర్ సమీపంలోని సోలీపూర్ గేటు వరకు బైపాస్ రోడ్డుకు ఇరువైపులా సేకరించిన స్థలంలో అధికారులు సర్వీస్ రోడ్లను అభివృద్ధి చేయాలి. సర్వీస్ రోడ్లను అభివృద్ధి చేస్తే సమీప గ్రామాల ప్రజలు బైపాస్‌పై ప్రయాణం తగ్గిస్తారు. దీంతో సాధ్యమైనంత వరకు ప్రమాదాలను నివారించే అవకాశం ఉంది. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ, కొత్తూరు

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

మున్సిపల్ చైర్మన్ నరేందర్



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న నరేందర్, భక్తులు

షాద్‌నగర్: ప్రజలందరు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని మున్సిపల్ చైర్మన్ నరేందర్ అన్నారు. ధనుర్మాస సంకష్ట చతుర్థిని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని వినాయక గంజ్‌లోని వినాయక దేవాలయంలో మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో నరేందర్ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో మనస్సు ఎంతో ప్రశాంతంగా ఉంటుందన్నారు. భక్తితోనే ముక్తి లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఈశ్వర్ రాజు, కోఆప్షన్ సభ్యుడు ఒగ్గుకిషోర్, నాయకులు వెంకటేష్‌గౌడ్, గోపాల్, సాయిచరణ్, ప్రకాష్, నర్సింలు, కృష్ణయ్య, సత్యం, శ్రీనివాస్, శంకర్‌లాల్ లాహోటీ, ఓంప్రకాష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను రద్దు చేయండి

సీఐటీయూ నాయకుడు దేవేందర్



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చేవెళ్ల: అంగన్‌వాడీలకు ఉన్న ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల సమావేశం నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీల సమస్యలపై సీడీపీఓ శోభారాణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. దేశంలోని 25 రాష్ట్రాల్లో ఎక్కడ కూడా ఎన్‌హెచ్‌టీఎస్ యాప్ లేదని కేవలం పోషణ్ ట్రాకర్‌యాప్‌ను మాత్రమే ఉపయోగిస్తున్నారని చెప్పారు. తెలంగాణలో ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను అమలు చేస్తూ అంగన్‌వాడీ టీచర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అంగన్‌వాడీ కేంద్రాలు చిన్న పిల్లలు, గర్భిణులకు పౌష్టికాహారం ఇవ్వాలనే ఉద్దేశంతో కొనసాగుతున్నాయని చెప్పారు. వీటికి నాణ్యమైన సరుకులు మాత్రం సరఫరా చేయడం లేదు. ఈ యాప్‌ను తెలంగాణ రాష్ట్ర కమిటీ వ్యతిరేకిస్తూ ఆందోళనకు పిలుపునిచ్చిందని తెలియజేశారు. అంగన్‌వాడీల్లో 60ఏళ్లు పైబడిన టీచర్లకు ఎలాంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇన్సూరెన్స్ సౌకర్యం, ఈఎస్ఐ, పీఎఫ్ లాంటి సౌకర్యాలు లేవన్నారు. కానీ, అంగన్‌వాడీ టీచర్లతో మాత్రం ప్రభుత్వాలు వెట్టిచాకిరి చేయించుకుంటున్నాయని మండిపడ్డారు. అంగన్‌వాడీ టీచర్ల సమస్యలపై జనవరి 27వ తేదీన సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా, ఫిబ్రవరి 13న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా, మార్చి మొదటి వారంలో సీఎం క్యాంప్ కార్యాలయం ప్రగతి భవన్ ముట్టడి వంటి కార్యక్రమాలను రాష్ట్ర కమిటీ ప్రకటించిందన్నారు. ఇందుకు అంగన్‌వాడీ టీచర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలు మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జాతీయ అవార్డుకు వెంకటేష్ ఎంపిక



నియామక పత్రం అందజేస్తున్న రాధాకృష్ణ

షాబాద్: మలిదశ ఉద్యమకారుడు, అంబేడ్కర్, జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండలం నాగర్‌కుంట గ్రామానికి చెందిన మల్లి వెంకటేష్‌కు నగరంలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ఎంపిక చేసి నియామక పత్రం అందజేశారు. వెంకటేష్‌ను పలువురు నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మార్చి 12వ తేదీన తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ సౌత్ ఇండియా ఆరో కాన్ఫరెన్స్‌లో జాతీయ అవార్డు అందజేస్తామన్నారు. నాకు ఈ వార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ మల్లేష్ తదితరులున్నారు.

గ్రామసభలో గందరగోళం

సర్పంచ్‌ను నిలదీసిన వెలిజర్ల వాసులు



గ్రామసభలో పాల్గొన్న సర్పంచ్ అమృతమ్మ

షాద్‌నగర్‌రూరల్: 'కంటి వెలుగు' కార్యక్రమంపై ఏర్పాటు చేసిన గ్రామసభ గందరగోళంగా మారింది. మంగళవారం మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో సర్పంచ్ అమృతమ్మ అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. ఈ సభలో కంటి వెలుగుకు సంబంధించిన అంశంపై చర్చించకుండా ఇతర అంశాలపై చర్చించడంతో గ్రామస్తులు సర్పంచ్‌ను నిలదీశారు. గ్రామంలోని సీసీ రోడ్లు, వీధిదీపాలు, మురుగు కాల్వల వంటి తదితర సమస్యలపై చర్చించారు. గ్రామసభ ముఖ్య ఉద్దేశం కంటి వెలుగు కార్యక్రమంపై ఉండగా ఆ విషయం గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. దీంతో గ్రామసభలో కొద్ది సేపు గందరగోళం నెలకొంది. అనంతరం గ్రామ శివారులో ఏర్పాటు చేయనున్న కార్వీ అనుమతులపై మీ అభిప్రాయం ఏమిటని గ్రామస్తులు ప్రశ్నించారు. కార్వీ ఏర్పాటుకు అనుకూలంగా మాట్లాడుతున్న మీరు క్రషర్ యజమానుల సహకారంతో ప్రజల అవసరాలకు కావాల్సిన ఆరోగ్య ఉపకేంద్రం, వాటర్ ప్లాంట్, హెల్త్ క్యాంపు వంటి వాటిని ఏర్పాటు చేయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు, పంచాయతీ సెక్రటరీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

ఎస్టీయూ జిల్లా కార్యదర్శి శివారెడ్డి

షాబాద్: ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి రాష్ట్ర మహాసభలు ఎంతో దోహదపడతాయని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి శివారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగయ్య కలిసి గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 13,14 తేదీల్లో సాగర్ రోడ్డు మన్నెగూడ చౌరస్తాలోని బీఎంఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తామని చెప్పారు.ఈ సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పోచమ్మ దేవాలయాభివృద్ధికి కృషి

ఎంపీపీ రవీందర్ యాదవ్

షాద్‌నగర్: పట్టణంలోని పోచమ్మ దేవాలయం అభివృద్ధిలో అందరు భాగస్వామ్యం కావాలని కేశంపేట ఎంపీపీ రవీందర్ యాదవ్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని పరిగిరోడ్డు న్యూసిటీ కాలనీలోని పోచమ్మ ఆలయం పునర్ నిర్మాణానికి సంబంధించిన డిజైన్‌పై స్థపతితో చర్చించారు. ఈ సందర్భంగా రవీందర్‌యాదవ్ మాట్లాడుతూ.. భక్తుల పాలిట కొంగుబంగారంగా వెలుగొందుతున్న పోచమ్మ దేవాలయం నిర్మాణానికి అందరు సహకరించాలన్నారు. దేవాలయానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నట్‌రాజన్, మాజీ చైర్మన్ విశ్వం, ఈట నరేందర్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

కేశంపేట: క్రీడల్లో యువత రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎంపీపీ ఎల్గనమోని రవీందర్ యాదవ్ అన్నారు. మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో ఎన్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ.. యువకులు గ్రామస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో విశాల , గ్రామ సర్పంచ్ పార్వతమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డిపాల్గొన్నారు.

చలో బెంగుళూరుకు తరలిన నేతలు

షాద్‌నగర్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ సాధనకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అధ్యక్షతన బెంగుళూరులో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ జాతీయ మహాసభలకు మంగళవారం షాద్‌నగర్ నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ నర్సింహ్మామాదిగ ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదింపజేసి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

కొందుర్గు: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ్మా స్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. మహిళలు రంగురంగుల ముగ్గులను వేయడంతో దేవాలయ ప్రాంగణం శోభాయమానంగా మారింది. ఈ పోటీల్లో మొత్తం 60 మంది మహిళలు పాల్గొనగా ఈసరి మాధవి వేసిన ముగ్గు మొదటి బహుమతికి ఎంపికైంది. అదేవిధంగా కె.శిరీష ద్వితీయ, జె. సంధ్య తృతీయ బహుమతులకు ఎంపికయ్యారు. విజేతలకు కొందుర్గు గ్రామపంచాయతీ 6వ వార్డు సభ్యులు మంజుల ప్రథమ బహుమతిగా వెండి పట్టీలు, ద్వితీయ బహుమతి పట్టుచీర, తృతీయ బహుమతి ప్యాన్సీ చీరలను అందజేశారు. అలాగే, జీఎం పటేల్ ఫిల్లింగ్ స్టేషన్ ఆధ్వర్యంలో కన్సోలేషన్ బహుమతులను వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్ అందజేశారు. కార్యక్రమాన్ని ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ లాలయ్య పర్యవేక్షించగా, జీహెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు ఉషశ్రీ, శివలింగమ్మ, సిరియాళ, ఎస్ఎంసీ చైర్మన్ రమాదేవి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

సమయానికి బస్సులు నడపాలని ధర్నా



బస్సు ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

షాబాద్: సమయానికి బస్సులు నడపకపోవడంతో పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు ధర్నాకు దిగారు. మంగళవారం మండల పరిధిలోని కొమరబండ గ్రామానికి చెందిన 50 మంది విద్యార్థులు గ్రామానికి వచ్చిన బస్సును ఆపి ధర్నాకు చేశారు. ఉదయం 9 గంటలకు రావలసిన బస్సు 11 గంటలకు వస్తే మేము పాఠశాలకు, కళాశాలలకు ఎలా వెళ్లాలి ఏం చదువుకోవాలని బస్సు డ్రైవర్, కండక్టర్‌ను నిలదీశారు. ప్రతి రోజు ఉదయం 9 గంటలకు బస్సు నడపాలని డిమాండ్ చేశారు. ఇలా అయితే మా పిల్లల చదువులు ఏట్ల అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నించారు. షాద్‌నగర్ డిపో మేనేజర్ వెంటనే స్పందించి మా గ్రామానికి వచ్చే బస్సు సమయానికి నడపాలని కోరారు. విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ విషయంపై డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఫోన్‌లో సర్పంచ్ చంద్రశేఖర్ మాట్లాడి సమయానికి బస్సులు నడపా లని కోరారు.దీంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

రేషన్ బియ్యం పంపిణీలో జాప్యం తగదు

బీజేపీ నాయకుడు వెంకటేశ్

షాద్‌నగర్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం సరఫరా చేసిన సబ్సిడీ రేషన్ బియ్యం పేదలకు వెంటనే పంపిణీ చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎంకనోళ్ళ వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. దేశంలోని పేద ప్రజల ఇబ్బందుల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది చివరి వరకు ఉచిత రేషన్ బియ్యాన్ని ఇవ్వా లని నిర్ణయించిందన్నారు. ఈ సబ్సిడీ బి య్యాన్ని రేషన్ దుకాణాలకు సరఫరా చేసినా రాష్ట్ర ప్రభు త్వం పంపిణీ చేయడం లేదని ఆరోపించారు. రేషన్ దుకాణాలకు వచ్చిన బియ్యాన్ని ఇవ్వడంలో ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. సంక్రాంతి పండగ సందర్భంగా పేదల అవసరాలను దృష్టిలో పెట్టుకొని రేషన్ డీలర్ల ఆన్‌లైన్‌ను వెంటనే ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. బియ్యం పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వ స్వార్థ రాజకీయాలకు పాల్పడుతుందన్నారు.

సీపీఐ పేదల పార్టీ

కొందుర్గు: సీపీఐ పేదల పక్షాన పోరాడే పార్టీ అని సీపీఐ మండల కార్యదర్శి వెంకటేష్ అన్నారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం చెన్నారెడ్డిగూడ గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధనకు సీపీఐ పోరాడుతుందన్నారు. పేదలకు న్యాయం జరగాలంటే సీపీఐని అధికారంలోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, చెన్నయ్య, మంజుల, చిన్నయ్య, లింగం ,తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మంజులరెడ్డి

డీసీసీబీ డైరెక్టర్ మంజులరెడ్డి

నందిగామ: విద్యార్థులు, యువకులు చదువుతో పాటు, క్రీడల్లో రాణించాలని డీసీసీబీ డైరెక్టర్, మేకగూడ పీఏసీఎస్ చైర్మన్ కంకంటి మంజుల రెడ్డి అ న్నారు. మండల పరిధిలోని మేకగూడలో ప్రవీన్, లింగం ఆధ్వర్యంలో మేకగూడ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీసీబీ డైరెక్టర్, మేకగూడ పీఏసీఎస్ చైర్మన్ మంజులరెడ్డి మంగళవారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణస్థాయిలో నిర్వహించే క్రీడాపోటీలను యువకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడల్లో నైపుణ్యం సాధించేందుకు టోర్నమెంట్‌లు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో క్రీడామైదానాలను ఏర్పాటు చేసిందని వివరించారు. ఆటల్లో గెలుపోటములు సాధా రణ మని అన్నారు. క్రీడలతో శారీరకంగానే కాకుండా మానసికోల్లాసం కూడా లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజునాయక్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పద్మారెడ్డి, నాయకు లు సూక్యానాయక్, దామోదర్‌రెడ్డి, మోహన్ నాయక్, శ్రీశైలం క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థుల మేధస్సుకు ప్రతిరూపం ఎగ్జిబిట్లు

హైదరాబాద్ జేఎన్‌టీయూ డైరెక్టర్ డాక్టర్ విజయకుమారి



మందు పిచికారీ చేసే యంత్రం



విత్తనాలు నాటే యంత్రం



రోబోటిక్స్ సోఫియా

మొయినాబాద్‌రూరల్: ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రాజెక్టులు , అప్లికేషన్‌లు, ఇంజనీరింగ్ టెక్నికల్ ప్రయోగాలు చేయడం ద్వారా విద్యార్థులకు విజ్ఞానం పెంపొందుతుందని హైదరాబాద్ జేఎన్‌టీయూ డైరెక్టర్ డాక్టర్ విజయకుమారి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ ఇంటరాక్షన్ సెల్ 2023 సంవత్సరానికి గాను కళాశాలలో కంట్రీవ్యూ పేరుతో ప్రాజెక్టు ఎగ్జిబిట్స్‌ను నిర్వహించారు. ప్రాజెక్టు ఎగ్జిబిట్స్ పర్యావరణ, భద్రత రోబోటిక్స్ ఐటీ ఇంజనీరింగ్ టెక్నికల్స్ అప్లికేషన్ల సాఫ్ట్‌వేర్, అప్లికేషన్‌ల అభివృద్ధిలో విద్యార్థులు పలు ప్రాజెక్టులను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేఎన్‌టీయూ డైరెక్టర్ విజయకుమారి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు నిర్వహించిన ప్రాజెక్టులను తిలకించి ఆమె మాట్లాడుతూ.. ప్రాజెక్టు ఆలోచనలను సామాజిక ప్రయోగకరమైన ఉత్పత్తులుగా మార్చుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఉత్తమ ప్రాజెక్టులకు నగదు బహుమతులు, అభినందనలు కళాశాల అందజేయడం ఎంతో గుర్తింపు అన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సాయిబాబారెడ్డి, ప్రిన్సిపాల్ పద్మజ, సజన, శ్రీలత, ఏఓ వెంకటచలం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు మేలైన పరికరాలు..

ఇంజనీరింగ్ విద్యార్థులు రైతులకు ఉపయోగపడే యంత్రాలను కనుగొంటున్నారు. ప్రాజెక్టు ఎగ్జిబిట్స్‌లో రైతులు ఉపయోగించే పరికరాలు ఎంతో ఆకట్టుకున్నాయి. అందులో పంటలకు మందులు పిచికారీ చేసే యంత్రాలు, ప్రజలకు వెంటిలేటర్ ఎమర్జెన్సీ కోసం గాలి ఇచ్చే యంత్రాలు, రైతులు విత్తనాలు నాటే యంత్రాలు, వివిధ కళాశాలల నుంచి వచ్చిన ప్రముఖులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న రోబోటిక్స్ సోఫియా

మండల పరిధిలోని విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ప్రాజెక్టు ఎగ్జిబిషన్‌లో గేటు ద్వారం వద్ద రోబోటిక్స్ సోఫియాను ఏర్పాటు చేశారు. ఈ రోబోటిక్స్ సోఫియా వస్తున్న ప్రముఖులను, విద్యార్థులకు స్వాగతం పలుకుతూ అందరిని సౌండ్ సిస్టమ్ ద్వారా వెల్‌కమ్ అంటూ స్వాగతించింది. దీంతో, రోబోటిక్ సోఫియాను చూసి అందరు నవ్వుతూ నమస్కరిస్తూ హాయ్ బా య్ చెబుతూ ప్రాజెక్టులోకి ప్రవేశించారు.